సీఎం రాకకు సర్వం సిద్ధం

- పర్యటన ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష
- రోడ్ షో, బహిరంగ సభ స్థలం తదితర ప్రాంతాల పరిశీలన



కాకినాడ ఆర్ఎంసీ క్రీడా మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లపై నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మంగళవారం సమీక్షించారు. బుధవారం ఉదయం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ రానున్న నేపథ్యంలో చేపట్టనున్న ఏర్పాట్లపై అధికారులతో సమావేశమయ్యారు. తొలుత బహిరంగ సభ జరిగే ఆర్ఎంసీ గ్రౌండ్స్‌ను అధికారులు, జిల్లా స్థాయి ప్రత్యేకాధికారులతో కలసి పరిశీలించారు. సభకు హాజరయ్యే పింఛన్‌దారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజలకు కల్పించిన సదుపాయాలను పర్యవేక్షించారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుధ్యంతో పాటు ఇతర ఏర్పాట్లకు సంబంధించి అక్కడ ఉన్న ఆయా విభాగాధిపతులకు సూచనలిచ్చారు. అలాగే హెలిప్యాడ్ నుంచి ఆర్ఎంసీ గ్రౌండ్స్ వరకు జరిగే రోడ్‌షోపై కూడా ఆయన అధికారులతో సమీక్షించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లాస్థాయి ప్రత్యేకాధికారులు, కార్పొరేషన్ యంత్రాంగంతో సమావేశమై చర్చించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎస్ఈ సత్యకుమారి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాసు, ఈఈలు మాధవి, వెంకట్రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జిల్లాస్థాయి అధికార యంత్రాంగం కమిషనర్ వెంట ఉన్నారు.

క్లుప్తంగా

మానసిక శక్తిని వృద్ధి చేసుకోవాలి

ఓంశాంతి ప్రతినిధి రజనీ దీదీ



సదస్సులో ప్రసంగిస్తున్న రజనీ దీదీ

కాకినాడ రూరల్: చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అనేక ఒత్తిళ్ళు నెలకొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో మానసిక ప్రశాంతత వృద్ధి చేసుకోవాలని ఓం శాంతి ఆశ్రమాల ప్రతినిధి రజనీ దీదీ పేర్కొన్నారు. స్థానిక శాంతి వనంలో శ్రీ విద్య కాంతి పిరమిడ్ ధ్యాన మందిరం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఆలోచనలను పరిశీలించి, శోధించడమే ధ్యానమన్నారు. ఈ ధ్యానానికి క్రమ శిక్షణ, సరళ, సాత్విక జీవన విధానం ప్రధానమన్నారు. మన మనసును వీక్షించి, ఆలోచనలను నియంత్రించే సత్తాను ధ్యానం మనలో పెంచుతుందన్నారు. కార్యక్రమంలో అడబాల స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాళమ్మతల్లి ఆలయ నిర్మాణం



పెనుగుదురు గ్రామదేవత పాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీవిద్య, సర్పంచ్ వెంకట మాధవి, రమేష్ దంపతులు

- రూ.35 లక్షలతో చురుగ్గా పనులు
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కరప: నియోజకవర్గ పరిధిలో ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తెలిపారు. మండలంలోని పెనుగుదురు గ్రామదేవత పాళమ్మతల్లి ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా మంగళవారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో సతీసమేతంగా పాల్గొన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఆలయాల పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తీసుకెళ్లగా, నిధులు మంజూరు చేశారన్నారు. పాళమ్మతల్లి ఆలయ నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు చేశామన్నారు. సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి, రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు బండారు సుజాత, వెంకటేశ్వరరావు, ఆలయ ఉత్సవ కమిటీ ఆలయాన్ని చక్కగా నిర్మించారన్నారు.

4న విగ్రహ ప్రతిష్ఠ

పునర్నిర్మించిన ఆలయంలో గురువారం జరిగే పాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠకు ముందస్తు పూజలు మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీవిద్య తదితర దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, కరప మార్కెట్ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ తుమ్మలపల్లి మాచరావు, బండారు సతీష్, దేవదాయశాఖ ఈఓ పీవీఎస్ సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

డైనమిక్ లీడర్ సీఎం జగన్

- హామీల అమలే ఇందుకు నిదర్శనం
- ఇక్కడి నుంచే పింఛన్ల పెంపు సంతోషకరం
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



కాకినాడ: రాజకీయాల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి పనిచేసే నాయకుడిని ప్రజలంతా గుండెల్లో పెట్టుకుంటారని. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా అదే కోవకు చెందుతారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. నవరత్న పథకాల ద్వారా ఐదేళ్ల క్రితం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి సభా వేదిక వద్ద ఎమ్మెల్యే ద్వారంపూడి మంగళవారం రాత్రి విలేకర్లతో మాట్లాడారు. పింఛన్ల సొమ్మును దశలవారీగా మూడు వేలకు పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు ఆ మొత్తాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని కాకినాడ నుంచి ప్రారంభించడం మరింత సంతోషదాయకమన్నారు. అవ్వాతాతలతో పాటు ప్రతి పింఛన్‌దారుడు ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే జగన్‌ను మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి కోరారు. సీఎం పర్యటనలో భాగంగా రూ.20 కోట్లతో నిర్మించిన రాగిరెడ్డి వెంకటజయ రామ్‌కుమార్ కళాక్షేత్రాన్ని, రూ.65 కోట్లతో నిర్మించిన ముత్తా గోపాలకృష్ణ వారధి, రూ.9.5 కోట్లతో నిర్మించిన స్కేటింగ్‌రింక్‌లను ఆయన ప్రారంభిస్తారన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయడం ద్వారా సీఎం జగన్ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొంది డైనమిక్ లీడర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు.

క్షత్రియ పరిషత్‌లో సంక్రాంతి సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న క్షత్రియ పరిషత్ మహిళా విభాగం సభ్యులు

బోట్‌క్లబ్: క్షత్రియ పరిషత్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గాంధీ నగర్‌లోని క్షత్రియ పరిషత్ కమ్యూనిటీహాల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంబరాల్లో భాగంగా మహిళలకు రంగవల్లి పోటీలు నిర్వహించారు. పిండివంటల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లలకు భోగి పళ్లు వేసి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పల్లెటూరి వాతావరణానికి ఏమీ తగ్గకుండా భోగి మంటలు, గంగిరెద్దుల సందడి, గుడిసెల వాతావరణంతో పాటు పుంగనూరు ఆవులు ఈ సందడిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంక్రాంతి పండగ వాతావరణంతో క్షత్రియ మహిళలు చేసిన నృత్యాలు, పాడిన పాటలు అందర్నీ ఆకట్టుకున్నారు. క్షత్రియ పరిషత్ అధ్యక్షులు అడ్డూరి రామకృష్ణ భాస్కరరాజు, కార్యదర్శి వీవీవీ వర్మ, మహిళా అధ్యక్షురాలు పెన్మత్స పార్వతి, మహిళా కార్యదర్శి దేవి వర్మ పాల్గొన్నారు.

వాకలపూడిలో వై ఏపీ నీడ్స్ జగన్



వాకలపూడిలో మాట్లాడుతున్న మండల జేసీఎస్ కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు లబ్ధి, గ్రామ సచివాలయ పరిధిలోని అభివృద్ధి పనుల వివరాలు ప్రజలకు తెలియజేసే లక్ష్యంగా నిర్వహిస్తున్న వై ఏపీ నీడ్స్ జగన్ వాకలపూడి సచివాలయం-1 పరిధిలో మంగళవారం నిర్వహించారు. మండల నోడల్ అధికారి, ఈఓ పీఆర్ అండ్ ఆర్‌డీ రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు సంక్షేమ పథకాల వివరాలు తెలియజేశారు. సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు రూ.28.8 కోట్ల లబ్ధి నేరుగాను, నాన్ డీబీటీ ద్వారా అందిందన్నారు. జేసీఎస్ మండల కన్వీనరు గీసాల శ్రీనివాసరావు జగనన్నే మా నమ్మకమన్నారు. ఏపీకి మళ్లీ జగనే కావాలన్నారు. సంక్షేమ పథకాలు గతంలో ఏ ప్రభుత్వం, ఏ సీఎం ఇవ్వని విధంగా జగన్ అందించారని వైఎస్సార్ సీపీకి మరో అవకాశం ఇచ్చేందుకు ఎమ్మెల్యేగా కురసాల కన్నబాబును మరో సారి గెలిపించాలన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు సచివాలయ పరిధిలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించి, సంక్షేమ పథకాల గురించి ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గొల్లపల్లి జగన్, విజయ సారథి, నల్లా శ్రీను, అనుసూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధావతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారు బుద్ధావతారంలో భక్తులను దర్శనమిచ్చారు. స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

- జెడ్పీటీసీ సుబ్బారావు, ఎంపీపీ శ్రీలక్ష్మి
- కరపలో రెండో విడత వైద్య శిబిరం
- 316 మంది రోగులకు పరీక్షలు



కరపలో రోగికి మందులు అందజేస్తున్న నాయకులు, అధికారులు



వెంకటాపురంలో రోగికి మందుల సంచిని అందజేస్తున్న నోడల్ అధికారి, జేడీ నరసింహారావు

కరప: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక చిరంజీవి కళ్యాణ మండపంలో మంగళవారం సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరాన్ని వారు ప్రారంభించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ జె.నరసింహనాయక్ శిబిరాన్ని పరిశీలించి, వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. గతంలో నిర్వహించిన శిబిరంలో వైద్యం చేయించుకున్న వారిని కలసి, వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని, తిరిగి వైద్యశిబిరానికి తీసుకొచ్చి తగిన వైద్యం చేయాలని పీహెచ్‌సీ వైద్యులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి మంగళవారం, శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించాలన్నారు. జిల్లాలో ఒకటే కరోనా కేసు నమోదు అయిందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 316 మంది శిబిరానికి రాగా డివిజనల్ వైద్యాధికారి, కరప పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి మందులను అందజేశారు. కంటిపరీక్షలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, ఎంపీడీఓ కె.అప్పారావు, గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, వీఆర్వో ఏవీఎస్ రామకృష్ణారెడ్డి, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

పి.వెంకటాపురంలో

కాకినాడ రూరల్: ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేపట్టి తద్వారా వారికి నిపుణులైన వైద్యులతో మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మండలం పి.వెంకటాపురంలో మంగళవారం ప్రారంభమయ్యింది. పండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.మాధవిలో వైద్య శిబిరం ద్వారా సుమారు 158 మందికి వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని జిల్లా నోడల్ అధికారి, హెల్త్ డిపార్టుమెంట్ జేడీ డాక్టర్ నరసింహారావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రత్నకుమార్ సందర్శించారు. శిబిరంలో వైద్య సేవలందుకున్న వారికి వారి ఆరోగ్య, వైద్య వివరాలతో బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేడీ నరసింహారావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచిత వైద్య సేవలతో పాటు మందులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, స్రవంతి, సర్పంచ్ పెంచే సోమరాజు, ఈఓ పీఆర్ అండ్ ఆర్‌డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి రామ్మోహ్మన్, పీహెచ్‌సీ సిబ్బంది మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ రూరల్: శారదాంబ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ మధురా నగర్ ఫీడర్ విద్యుత్ మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ జి.ప్రసాద్ తెలియజేశారు. మధురానగర్, అశోక్‌నగర్, ఎస్.అచ్యుతాపురం, గోకులం ఏరియా, విద్యుత్‌నగర్, కరణం గారి జంక్షన్, జీపీటీ కాలనీలో చెట్ల కొమ్మలు తొలగింపు ఉంటుందని, ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాజీ సర్పంచ్ రక్తదానం



రక్తదానం చేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

కరప: గ్రామ మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు మంగళవారం 88వ సారి రక్తదానం చేశారు. గ్రామానికి చెందిన పలివెల శివప్రసాద్ కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ చేయించుకోవడంతో అత్యవసరంగా రక్తం అవసరమైంది. ఆయనకు రక్తదానం తాతీలు రక్తదానం చేశారు.

ఎస్‌జీఎఫ్ఐ స్క్వాష్ క్రీడాకారుల ఎంపిక



జాతీయ స్క్వాష్ పోటీలకు ఎంపికైన రాష్ట్ర ఎస్‌జీఎఫ్ఐ జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్ర స్థాయి అండర్ - 14, 17, 19 పాఠశాల క్రీడా సమాఖ్య స్క్వాష్ క్రీడాకారుల ఎంపికలు మంగళవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరిగాయి. వీటిని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) బి.శ్రీనివాస్ కుమార్ ప్రారంభించారు. స్క్వాష్ ఇండోర్ స్టేడియంలో పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలకు రాష్ట్ర వ్యాప్తంగా 48 మంది క్రీడాకారులు హాజరయ్యారు. 24 మందిని ఈ నెల 13 నుంచి 16 వరకూ పూణేలో జరిగే జాతీయస్థాయి స్క్వాష్ పోటీలకు ఎంపిక చేశారు. డీఎస్ఏ స్క్వాష్ కోచ్ లక్ష్మణ్‌రావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ అండర్ - 19 కార్యదర్శి శివరామకృష్ణ, హుస్సేన్, పి.పట్టాభిరామ్, శ్రీహరి రాజు, మంగయమ్మ పాల్గొన్నారు.